సాక్షి అనంతపురం

సోమవారం । 13 । జనవరి । 2025



టమాట కిలో రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



పరిష్కార వేదిక రద్దు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సంక్రాంతి సందర్భంగా రద్దు చేసినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం

34.1°/15.5°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సంతోషం వెల్లివిరియాలి

- జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: భోగ భాగ్యాల భోగి.. సుఖ సంతోషాల సంక్రాంతి.. కమ్మని వంట కనుమ కలబోసి అందరి ఇంటా ఆనందం వెల్లివిరియాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు, సొంత గ్రామాలపై మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక మకర సంక్రాంతి అని తెలిపారు. పండుగ సంబరాలతో తెలుగు లోగిళ్లు శుభాలకు, సుఖ సంతోషాలకు నెలవు కావాలని, రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నదాతల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు.

ఎస్పీ శుభాకాంక్షలు



ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ఎస్పీ పి. జగదీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంటిల్లిపాది సంతోషంగా పండుగను చేసుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికెళ్లకుండా భోగి, మకర సంక్రాంతి, కనుమలను జరుపుకోవాలని ఆయన కోరారు.

బాల్య వివాహం అడ్డగింత

గోరంట్ల: అజ్ఞాత వ్యక్తి సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు ఓ బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. ఓబుళదేవరచెరువు మండలం సున్నంపల్లికి చెందిన 26 ఏళ్ల యువకుడికి, వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం టీ వెలమవారిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల అమ్మాయికి గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం వివాహానికి ఏర్పాట్లు చేశారు. మైనర్‌కు వివాహం జరుగుతోందని ఓ అజ్ఞాత వ్యక్తి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ వర్కర్ విజయమ్మ సదరు కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. బాల్య వివాహం నిలుపుదల చేయించారు.

పండుగ తర్వాత కంది కొనుగోళ్లు



అనంతపురం అగ్రికల్చర్: సంక్రాంతి పండుగ తర్వాత రైతుల నుంచి కందుల కొనుగోళ్లు ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి తెలిపారు. క్వింటా మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.7,550 ప్రకారం రైతులకు చెల్లిస్తామన్నారు. ఇప్పటికే ఆర్‌ఎస్‌కే వేదికగా 1,300 మంది వరకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 1.02 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో కంది పంట సాగు చేశారు. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావచ్చని అధికారులు అంచనా వేశారు. ఇంకా ఎక్కువగానే దిగుబడులు అంచనా వేసినా... డిసెంబర్‌లో వాతావరణం మారిపోవడంతో కొంత మేర దిగుబడులు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. నాలుగైదు క్వింటాళ్ల మేర రావచ్చని, అందుకు తగ్గట్లుగానే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టారు. నవంబర్, డిసెంబర్‌లో బహిరంగ మార్కెట్‌లో క్వింటా కందులు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు పలికాయి. ఇటీవల పంట దిగుబడులు వస్తుండటంతో ధరలు తగ్గుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే దళారులు, వ్యాపారులతో నష్టపోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు వ్యాపారులకు అమ్మేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 31 మండలాల్లోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వరి, పత్తి, మొక్కజొన్న మాదిరి కంటితుడుపుగా కొనుగోళ్లు కొనసాగిస్తారా..? లేదంటే రైతులకు న్యాయం జరిగేలా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి రైతుల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తారా అనేది వేచిచూడాలి.

పైసల్లేవ్.. పండుగెలా..



జనం లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్న కొంతానపల్లి

- కళ తప్పిన పల్లె..
- దీనావస్థలో బతుకులు
- తెగుళ్లు, వర్షాభావంతో దారుణంగా దెబ్బతిన్న పంటలు
- ఇళ్లు చేరని ధాన్యపు రాశులు
- చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బందులు
- రాయదుర్గం మండలం కొంతానపల్లిలో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

డూడూ బసవన్నలు.. హరిదాసు కీర్తనలు.. ఘుమఘుమలాడే వంటకాలు వెతికినా కానరాలేదు.. పేరుకే పెద్ద పండుగ కానీ ఆ వాతావరణమే లేదు. తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులతో ధాన్యం ఇల్లు చేరలేదు. మార్కెట్లో ఏది కొనాలన్నా చుక్కలు కనిపిస్తున్నాయి. పండుగ నాడు పరమాన్నం కాదు.. పప్పన్నం తినడం కూడా భారంగా పరిణమించింది. 'సంక్రాంతి' సందర్భంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాజా పరిస్థితులపై 'సాక్షి' అధ్యయనం చేయాలని సంకల్పించింది.ఈ క్రమంలో రాయదుర్గం మండలం కొంతానపల్లిని పరిశీలించగా ప్రజలు తమ కష్టాలు కళ్లకు కట్టారు.



పొలాల్లోనే వదిలేసిన నువ్వుల పంట

గ్రౌండ్ రిపోర్ట్

రాయదుర్గం: కొంతానపల్లిలో భూతద్దం పెట్టి చూసినా ఎక్కడా సంక్రాంతి కళ కనిపించలేదు. వీధులన్నీ బోసిపోయి కనిపించాయి. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన అనంతమ్మ అనే వృద్ధురాలిని 'సాక్షి' పలకరించింది..'అవ్వా బాగున్నారా? పండుగ ఎలా చేస్తున్నారు' అని అడగ్గా... 'చేతిలో చిల్లిగవ్వ లేదు నాయనా.. తినేందుకు తిండికే కరువొచ్చింది. పండుగ ఎలా చేయమంటావ్?' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అదే దారిలో కొంత దూరం వెళ్లాక క్రిష్టప్ప, రాజేష్ కనిపించారు. పండుగ గురించి ప్రస్తావించగానే.. రంగులు కొనేందుకు సైతం డబ్బుల్లేవన్నారు. సంప్రదాయం ప్రకారం పండుగ రోజు గొబ్బెమ్మలు పెట్టి మమ అనిపించేస్తామన్నారు. మరో వీధిలో ఉండే కొల్లాపురమ్మ ఆలయం వద్దకు వెళ్లగా.. శ్రీనివాసులు, ఎర్రిస్వామి, హనుమంతు, బొమ్మయ్య తదితరులు కనిపించారు. గ్రామంలో ఎందుకిలా ఉందని ప్రశ్నిస్తే తమ తోటివారి దీనావస్థను కళ్లకు కట్టారు. 'సంక్రాంతి పండుగను నమ్ముకుని ఊరంతా సుమారు 400 ఎకరాల్లో నువ్వుల పంట సాగుచేశాం. రూ. లక్షల్లో ఖర్చయింది. తీరా పంట అందే సమయాన తెగుళ్లు సోకి నిలువునా ఎండిపోయింది. దీంతో పొలంలోనే వదిలేశాం. ఆశించిన స్థాయిలో వేరుశనగ కూడా పండలేదు. సజ్జ గింజలు కొంటేకానీ రొట్టె కాలని పరిస్థితి. భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలుంటే రూ.5 వేల నుంచి రూ.6 వేలు కిరాణా ఖర్చులు వస్తున్నాయి. కొత్త ధాన్యం ఆశించిన స్థాయిలో ఇంటికి చేరలేదు. ప్రభుత్వం కూడా ఆదుకోకపోవడంతో పండుగ చేసుకోవడం కష్టంగా మారింది' అని అన్నారు.

మూగజీవాలకూ కష్టాలు..

వీరితో మాట్లాడి కొంత దూరం వెళ్లాక కమల్‌రాజ్ అనే రైతు తన ఎద్దును పట్టుకుని వెళ్తూ కనిపించాడు. అయనను పలకరించగా... పాడి రైతుల కష్టాలు కళ్లకు కట్టాడు. గ్రాసం లేక పోషణ భారమైందని, మూగజీవాలకూ కష్టాలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశాడు. తమ ఊరిలోనే కాదు.. జిల్లాలోని అనేక గ్రామాల్లో నేడు ఇదే దుస్థితి ఉందని చెప్పుకొచ్చాడు.

గతంలో ఎప్పుడూ లేదు



ఉప్పు, పప్పే కాదు ఉల్లి, వెల్లుల్లి కూడా చుక్కలు చూపుతున్నాయి. గతంలో ఎప్పుడూ సంక్రాంతికి ఇలాంటి ఇబ్బందులు పడలేదు. ఖరీఫ్ పంటలు చేతికందలేదు. ప్రభుత్వం ఆదుకోవడం లేదు. సామాన్యులకు సంక్రాంతి గుదిబండగా మారింది.

– కొల్లారప్ప, గ్రామస్తుడు

గత ప్రభుత్వం ఆదుకుంది



గ్రామాల్లో సంక్రాంతి వాతావరణం కనిపించడం లేదు. డబ్బుల్లేక పెద్దగా ఆసక్తి చూపలేక పోతున్నారు. మా గ్రామంలో చాలా మంది నువ్వుల పంట సాగుచేసి నష్టపోయారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట ఆదుకోలేక పోయింది. ఈ సారి కొత్త ధాన్యం ఆశించిన స్థాయిలో ఇంటికి చేరలేదు. గత ప్రభుత్వం డీబీటీ ద్వారా నేరుగా ఖాతాలకు నగదు జమ చేసింది. ప్రతి పేదోడి ఖాతాలో డబ్బు ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నారు.

– విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్, కొంతానపల్లి



సజ్జరొట్టె, సెలిబిండి కరువు

సంక్రాంతి రోజు ముగ్గువేసే పరిస్థితి కూడా లేదు. కలర్ రేట్లు మండిపోతున్నాయి. కొందామన్నా గుమ్మడి కాయ కనిపించడం లేదు. సజ్జ రొట్టె, సెలిబిండి కరువైంది. మేం పిల్లలుగా ఉన్నప్పటి సంక్రాంతికి, ఇప్పటి పండుగకి చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. – సిద్దమ్మ, గ్రామస్తురాలు



కుమారుడిని చదువు మాన్పించా

నాకు సెంటు భూమి లేదు. భార్యతో కలసి నిత్యం కూలి పనులకెళ్తేనే జీవనం. కుమారుడు పదో తరగతి వరకు చదివాడు. పై చదువుకు ఖర్చులు భారం కావడంతో కళాశాలకు పంపడం లేదు. ప్రస్తుతం మాకు చేదోడుగా ఉంటున్నాడు. – క్రిష్టప్ప, గ్రామస్తుడు



పండుగే వద్దనుకున్నాం

రెండు పల్లాల వేరుశనగ విత్తితే కేవలం 18 సంచుల దిగుబడి దక్కింది. పెట్టుబడులు నెత్తిన పడ్డాయి. ప్రస్తుతం సజ్జలు కిలో రూ. 60, బెల్లం రూ.55 పలుకుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలన్నీ మండిపోతుండటంతో పండుగే వద్దనుకున్నాం. – రామాంజనేయులు, రైతు



పైసా సాయం అందలేదు

రెండెకరాల్లో నువ్వులు సాగు చేసి నష్టపోయాం. నేను, నా భర్త కూలి పనులకెళ్లి పిల్లల్ని పోషించుకుంటున్నాం. పండుగ చేసుకోవాలనే ఆలోచన లేదు. గతేడాది 'చేదోడు' పథకం ద్వారా రూ.18,750 అందింది. ఈ ఏడాది పైసా కూడా ఇవ్వలేదు. – మారెక్క, డ్వాక్రా సభ్యురాలు

ఖాకీల కర్కశం

- యువకుడిపై పోలీసుల అమానుష దాడి
- ఆపరేషన్ అయిందన్నా వదలని వైనం



తలకు గాయాన్ని చూపుతున్న ఇమ్రాన్

అనంతపురం: క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే పోలీసు శాఖలో కొందరు దారి తప్పుతున్నారు.విచక్షణారహితంగా ప్రవర్తిస్తూ శాఖ ప్రతిష్టకే మచ్చతెస్తున్నారు. అనంతపురంలో నడిరోడ్డుపై ఓ యువకుడిని పోలీసులు చావబాదిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నగరంలోని ఆర్టీఓ ఆఫీసు సమీపంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇమ్రాన్ నివాసముంటున్నాడు. ఆదివారం తన తల్లికి టిఫిన్ తీసుకురావడానికి ఐరన్ బ్రిడ్జి సమీపంలోని ఓ హోటల్ వద్దకు వెళ్లాడు. తన బైకును బయట పార్కు చేసి టిఫిన్ తీసుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే అతని బైకుపై కూర్చుని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ నారాయణ స్వామి టిఫిన్ చేస్తున్నారు. బయటకు వచ్చిన ఇమ్రాన్... 'ఆర్టీఓ ఆఫీసు సమీపంలో కొత్తగా ఇల్లు కడుతున్నాం. ఇంటి వద్ద కరెంట్ సామాన్లు ఎవరో దొంగిలించారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఆర్టీఓ ఆఫీసు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందో చెబుతారా?' అని కానిస్టేబుల్ నారాయణ స్వామిని అడిగాడు. అయితే, 'అది మా స్టేషన్ కాదు.. టూటౌన్ కిందకు వస్తుంది' అని కానిస్టేబుల్ చెప్పారు. ఈ క్రమంలోనే 'ఎలా ఫిర్యాదు చేయాలి సార్' అని ఇమ్రాన్ మరోసారి అడగ్గా.. కానిస్టేబుల్ రెచ్చిపోయాడు. 'రేయ్.. ల..కొడకా.. నేనేదో టెన్షన్‌లో ఉన్నాను. పో' అని దుర్భాషలాడాడు. దీంతో 'నా బండి మీద నుంచి కిందకు దిగండి.. నేను వెళ్లాలి' అని ఇమ్రాన్ అనగా... కానిస్టేబుల్ నారాయణ స్వామి ఆవేశంతో ఊగిపోయారు. ఇమ్రాన్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడే ఉన్న హోంగార్డు దాదాపీర్‌తో కలిసి చితకబాదారు. సెల్‌ఫోన్ లాక్కున్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్‌డిగ్రీ ప్రయోగించారు. తనకు అపెండిక్స్ ఆపరేషన్ అయిందని చెప్పినా వినకుండా కడుపుపై కొట్టారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తీవ్రంగా వాంతులయ్యాయని వాపోయాడు.సర్వజనాస్పత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

బాధితుడిపైనే కేసు

గాయాలపాలైన ఇమ్రాన్‌పైనే పోలీసులు కేసు నమోదు చేశారు. 'ఎలక్ట్రికల్ సామగ్రి చోరీ జరిగింది. యూనిఫాం తీసేసి ఉద్యోగాలు మానేయండి' అంటూ ఇమ్రాన్ గొడవపడ్డాడని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్నాడని కేసు కట్టడం గమనార్హం.

'ఉపాధి'లో అగ్రస్థానంలో నిలవాలి

- మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అంకంపల్లిలో ప్లాంటేషన్ పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బెళుగుప్ప: ఉపాధి హామీ పథకం అమలులో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బెళుగుప్ప మండలం అంకంపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన రెండు మినీ గోకులం షెడ్ల(పశువుల షెడ్లు)ను కలెక్టర్ ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 9.62 లక్షల నిధులతో చేపట్టిన ప్లాంటేషన్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మినీ గోకులం షెడ్లు, సిటీ ప్లాంటేషన్ పనులు ప్రారంభించడం సంతోషాన్నిచ్చిందన్నారు. జిల్లాకు 1,627 గోకులం షెడ్లు మంజూరు కాగా, ఇప్పటికే 600 షెడ్ల నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచామన్నారు. మినీ గోకులం షెడ్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కోడిపందేల నిషేధంపై కలెక్టర్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీం బాషా, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, వెటర్నరీ ఏడీ శ్రీనివాసగుప్తా, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ మమత, సర్పంచ్ రుద్రానంద, ఎంపీటీసీ ప్రభావతి, తహసీల్దార్ షర్మిలా, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ సూర్యప్రకాష్, వెటర్నరీ డాక్టర్ రమేష్, డాక్టర్ మంజునాథ్, ఆర్ఐ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మకర సంక్రాంతి ప్రతి ఇంటా కాంతిని నింపాలని ఆకాంక్షించారు. దేవుని కృపాకటాక్షాలతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ భోగ భాగ్యాలు, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవనం గడపాలని కోరుకున్నారు.

రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు

- 'హంద్రీనీవా' లైనింగ్ టెండర్లు ఆపాలి
- లేకుంటే అన్నదాతలతో ఉద్యమిస్తాం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రైతుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా లైనింగ్ పనుల టెండర్లను తక్షణం ఆపాలని, లేని పక్షంలో అన్నదాతలతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు అనాలోచిత నిర్ణయాలతో జిల్లా రైతాంగానికి తీరని నష్టం తప్పదన్నారు. జిల్లా ప్రజల కడుపు కొడుతూ తన సొంత నియోజకవర్గమైన కుప్పానికి నీరు తీసుకెళ్లేందుకే చంద్రబాబు లైనింగ్ పనులకు శ్రీకారం చుడుతున్నారన్నారు. లైనింగ్ కారణంగా హంద్రీనీవా ఎగువ, దిగువ దాదాపు 10 కిలోమీటర్ల లోపు భూగర్భ జలాలు అడుగంటి పోతాయని, ఐదు లక్షల ఎకరాల్లో వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. లక్ష మంది రైతులు భూములు అమ్ముకుని వలసలు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తుతుందన్నారు. సీఎం చంద్రబాబుకు రాజకీయాలు తప్ప జిల్లా ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదన్నారు.

గొప్ప సంకల్పంతో జగన్ నిర్ణయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచి, లైనింగ్ చేయాలని జీఓ విడుదల చేసిన విషయాన్ని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గుర్తు చేశారు. వెనుకబడిన ప్రాంతాలైన చిత్తూరు, కర్నూలు, అనంతపురం ప్రజలకు సీరివ్వాలనే గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్లామన్నారు. గాజులదిన్నెకు 3 టీఎంసీలు, పేరూరుకు 1 టీఎంసీ, శింగనమల చెరువుకు 1 టీఎంసీ, డోన్ నియోజకవర్గంలో 2 టీఎంసీలతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంతో చెరువులు నింపే కార్యక్రమం, భైరవానితిప్ప ప్రాజెక్టుకు దాదాపు 3.5 టీఎంసీలు, జీడీపల్లి అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్, తోపుదుర్తి రిజర్వాయర్ తదితర నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కానీ, నేడు సీఎం చంద్రబాబు 3,800 క్యూసెక్కులకు తీసుకువచ్చి జిల్లాకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. చంద్రబాబు విజ్ఞతతో ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు. కాలువ వెడల్పు చేసిన తర్వాతే లైనింగ్ చేసేలా మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ చొరవ చూపాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చంద్ర, పార్టీ రూరల్ మండల కన్వీనర్లు గోవింద్ రెడ్డి, బండి పవన్, రాప్తాడు కన్వీనర్ సాకే వెంకటేశులు, కార్యనిర్వాహణ కార్యదర్శి నీరుగంటి నారాయణ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, నాయకులు జూటూరు శేఖర్, ఈశ్వరయ్య, నిఖిల్ యాదవ్, పూలకుంట భాస్కర్ రెడ్డి, కొడిమి ఆనంద్ పాల్గొన్నారు.

- కాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో నూతనంగా వివిధ పదవుల్లో నియమితులైన నాయకులు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఈ సందర్భంగా సన్మానించారు.

'ఓపెన్ సైట్' జోలికొస్తే క్రిమినల్ కేసులు

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించిన పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట రెవెన్యూ గ్రామ పొలం 108, 109-1,109-2, 109-2బీ సర్వే నంబర్లలో వెలిసిన చంద్రప్రియనగర్‌లోని ఓపెన్ సైట్‌కు జోలికొస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని పంచాయతీ అధికారులు హెచ్చరించారు. 2.20 ఎకరాల ఓపెన్‌సైట్‌ను కొందరు రియల్టర్లు చదును చేయించి లేఔట్ వేయడంపై 'సాక్షి'లో 'ఓపెన్‌గా అమ్మేద్దాం!' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించారు. వెంటనే ఆ స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఓపెన్‌సైట్‌లో నిర్మించిన ప్రభుత్వ గోదాము మినహా తక్కిన 1.90 ఎకరాల భూమిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరపకూడదని స్పష్టం చేశారు. అతిక్రమించి ఎవరైనా అమ్మకాలు చేసినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం నేరమని స్పష్టం చేశారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం



తీవ్రంగా గాయపడిన ప్రశాంత్

బత్తలపల్లి: కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు... తాడిపత్రి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన తేజస్విని ఆదివారం ఉదయం బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లిలోని తమ బంధువుల ఇంటికని బయలుదేరి వచ్చి బత్తలపల్లిలో బస్సు దిగింది. అప్పటికే వేచి ఉన్న బంధువు ప్రశాంత్... ఆమెను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై డి.చెర్లోపల్లికి బయలుదేరాడు. తంబాపురం క్రాస్ వద్దకు చేరుకోగానే అప్పరా చెరువు నుంచి ఉన్నఫలంగా రోడ్డు మీదకు వచ్చిన కారును ఢీకొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్, తేజస్వినిని స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు అనంతపురానికి తీసుకెళ్లారు. వీరిలో తేజస్విని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేత 'నంద్యాల'



నంద్యాల జట్టుకు విజేత ట్రోఫీని అందజేస్తున్న పారిశ్రామిక వేత్త రామకృష్ణ పరమహంస

యాడికి: మండలంలోని రాయలచెరువులో శని, ఆది వారాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో నంద్యాల జట్టు విజయం సాధించింది. పోటీల్లో మొత్తం 24 జట్లు తలపడ్డాయి. నంద్యాల–వైజాగ్, ధర్మవరం –గుంటూరు, గుంటూరు–వైజాగ్ జట్ల మధ్య ఉత్కంఠ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ జట్టుపై నంద్యాల నంది పైపుల జట్టు గెలుపొందింది. విజేత జట్లను అభినందిస్తూ పారిశ్రామిక వేత్త రామకృష్ణ పరమహంస, కత్తి రమేష్, ఎరువుల అంగడి సూరి నగదు పురస్కారాలు, ట్రోఫీలను అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన బనగానపల్లి జట్టుకు వసీమ్ రాజా, నాల్గో స్థానంలో నిలిచిన రాయలచెరువు జట్టుకు రాజశేఖర్ నగదు పురస్కారాలను అందజేశారు. కాగా, పోటీలు చూసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. పోటీలను నిర్వాహకులు శంకర్ నాయుడు, రషీద్ షబ్బీర్ బాషా పర్యవేక్షించారు.

20 తోటల్లో కేబుల్ అపహరణ

శింగనమల: మండలంలోని సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, మట్లగొంది గ్రామాల పొలాల్లో రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్‌మోటార్ల కేబుల్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. గత రెండు రోజులుగా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటూ వచ్చింది. దీంతో రైతులు శనివారం పొలాల వైపుగా వెళ్లలేదు. ఆదివారం తెల్లవారుజామున పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో మోటార్లకు చెందిన కేబుల్ వైర్లు కత్తిరించి ఉండడం గమనించారు. ఈ మూడు గ్రామాల్లో 20 తోటల్లో మోటర్ కేబుల్ వైర్లు చోరీ చేసినట్లు బయటపడింది. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్బీకేలు పాయె..

ఆర్ఎస్‌కే సేవలూ లేకపాయె

రైతులకు దూరమవుతున్న ప్రభుత్వ సేవలు

- ఆర్ఎస్‌కేలుగా మార్పు చేసినా ప్రాధాన్యత ఇవ్వని సీఎం చంద్రబాబు
- వైఎస్ జగన్ సర్కార్‌కు మంచి పేరు రాకుండా కూటమి కుట్ర
- గుమ్మం వద్దకే ఎరువులు అందకుండా తగ్గించేసిన ప్రభుత్వం



నాడు: ఆర్బీకే కళకళ



నేడు: ఆర్ఎస్‌కే వెలవెల

అనంతపురం అగ్రికల్చర్: దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టిన గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వాటికి అనుబంధంగా రైతు ముంగిటకే ప్రభుత్వ ఫలాలు అందించడానికి వీలుగా పల్లె పల్లెలోనూ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేసింది. వ్యవసాయం, వాటి అనుబంధశాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఎవరికి ఏమి కావాలన్నా సచివాలయాలు, ఆర్బీకేల ద్వారా రైతుల గుమ్మం వద్దకే సేవలు అందజేస్తూ వచ్చింది. విత్తు నుంచి పంట దిగుబడి విక్రయాల వరకూ అడుగడుగునా రైతులకు అండగా పని చేసేలా ఆర్బీకేలను అప్పటి సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దారు. అప్పట్లో ఆర్బీకే వ్యవస్థ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై దేశవిదేశాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. అలాంటి ఆర్బీకేలు ఇప్పుడు ప్రాశస్త్యం కోల్పోయాయి. ఏడు నెలల క్రితం రాష్ట్రంలో ఏర్పడిన కూటమి సర్కార్ వైఖరే ఇందుకు కారణమైంది. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదనే దురాలోచనతో ఆర్బీకేలను పథకం ప్రకారం సీఎం చంద్రబాబు నిర్వీర్యం చేస్తూ వస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

ఆర్ఎస్‌కేలుగా మార్పు చేసినా..

ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే)గా పేరు మార్చిన కూటమి సర్కారు వాటి ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు తగ్గిస్తూ వచ్చింది. ఫలితంగా ఆర్ఎస్‌కేల్లో కియోస్క్ మిషన్లు పనికిరాకుండా పోతున్న పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో 451, శ్రీసత్యసాయి జిల్లాలో 416 ఆర్ఎస్‌కేలు పని చేస్తున్నాయి. అంటే ప్రతి పంచాయతీ పరిధిలో ఒక ఆర్ఎస్‌కేను ఏర్పాటైంది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, కమ్యూనిటీ హైయింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ)ల కింద ట్రాక్టర్లు, అత్యాధునిక పనిముట్లు, ఈ–క్రాప్, ఈ–కేవైసీ, పంటల ప్రణాళిక, విత్తన ప్రతిపాదనలు, ప్రకృతి వైపరీత్యాలు, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, దాణా, పశువైద్యం... ఇలా అన్ని రకాల సేవలు అందించిన ఒకప్పటి ఆర్బీకేలు...

గత ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల ద్వారా ఎరువుల అమ్మకాలు ఇలా	
సంవత్సరం	అమ్మిన ఎరువులు
2020 (3 నెలలు)	512 మెట్రిక్ టన్నులు
2021-22	10,131 మెట్రిక్ టన్నులు
2022-23	11,335 మెట్రిక్ టన్నులు
2023-24	12,179 మెట్రిక్ టన్నులు
2024-25	2,200 మెట్రిక్ టన్నులు

ఆర్ఎస్‌కేలుగా పేరు మార్చిన తర్వాత నామమాత్రపు సేవలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఆర్ఎస్‌కేల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువుల అమ్మకాలే అందుకు నిదర్శనం. 2020లో మే 30న రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ఆర్బీకేలను జగన్ సర్కారు అందుబాటులోకి తెచ్చింది. ప్రారంభించిన తొలి మూడు నెలల్లోనే ఆర్బీకేల ద్వారా 512 మెట్రిక్ టన్నుల ఎరువులను గ్రామాల్లోని రైతుల ఇంటి ముంగిటకే అందజేశారు. అప్పటి నుంచి ఏటా ఎరువుల అమ్మకాలు బాగా పెరిగాయి. 2023–24 నాటికి ఆర్బీకేల ద్వారా 12,179 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులు తీసుకెళ్లారు. దీని వల్ల రైతులకు ఎరువులపై పెట్టుబడి ఖర్చు బాగా తగ్గింది. ఎరువులు కావాలంటే పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి రావడం అనేది శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. అలాంటిది గ్రామ స్థాయిలోనే అందుబాటులో పెట్టడంతో రైతులకు ఎంతో ఉపశమనం లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పరిస్థితి మారి రైతులకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రణాళికలో భాగంగా వివిధ కంపెనీల నుంచి జిల్లాకు ఎరువులు చేరగానే మొదటి ప్రాధాన్యత కింద గత ప్రభుత్వం ఆర్బీకేలకు కేటాయిస్తూ వచ్చింది. ఇపుడు ఆర్ఎస్‌కేలకు ప్రాధాన్యత ఇవ్వక పోవడం విశేషం. ఈ ఏడాది కేవలం 2,200 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే ఆర్ఎస్‌కేల ద్వారా అందించడమే ఇందుకు నిదర్శనం.

సారా నిర్మూలనే ధ్యేయం

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

గుత్తి: జిల్లాలో సారా నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. గుత్తి ఎక్సైజ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సారా ఓ పెద్ద సమస్యలా మారిందన్నారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామ సభల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. తండా ప్రాంతాల్లో సారా తయారీ, రవాణా, విక్రయాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో సారా నిర్మూలనకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఎక్సైజ్ చట్టం ప్రకారం కేవలం పాత నేరస్తులనే కాకుండా అనుమానితులను కూడా బైండోవర్ చేసే అవకాశముందన్నారు. అలాగే మద్యం బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో గుత్తి ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ అస్లామ్ బేగ్ పాల్గొన్నారు.

నాలుగు ప్రాంతాల్లో చోరీలు

గుత్తి: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నాలుగు చోరీలు జరిగాయి. తాడిపత్రి రోడ్డులోని వినాయక ట్రేడర్స్, సమీర్ ట్రేడర్స్ దుకాణాల్లో ఆరు సెల్‌ఫోన్లు, రూ. 10 వేల నగదు అపహరించారు. ఇక్బాల్ ఐరన్ మార్ట్ వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. అలాగే అనంతపురం రోడ్డులోని ఓ వైండింగ్ షాపులో 20 కిలోల కాపరు వైరు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి, సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

సైబర్.. టెర్రర్

- సంక్రాంతి వేళ కానుకలు.. రీచార్జుల పేరుతో వల
- సీఎం కానుక అంటూ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు
- లింక్ నొక్కితే బ్యాంక్ ఖాతాలో నగదు మాయం
- సామాజిక మాధ్యమాలను అనుసరిస్తున్న నేరస్తులు


న్యూ ఇయర్ రీచార్జ్ ఆఫర్
నూతన సంవత్సరం సందర్భంగా (నారా చంద్రబాబు నాయుడు) ప్రతి ఒక్కరికీ 3 నెలల రీచార్జ్ ₹749 పూర్తిగా ఉచితంగా ఇస్తున్నారు కాబట్టి క్రింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయడం ద్వారా ఇప్పుడే రీచార్జ్‌ని పొందండి
ఈ ఆఫర్ పరిమిత కాలానికి మాత్రమే |
https://year-2025.blogspot.com/

నారా చంద్రబాబు నాయుడు పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న మెసేజ్

అనంతపురం: 'సంక్రాంతి సందర్భంగా ఖరీదైన చీర బహుమతికి మీరు ఎంపికయ్యారు. మీరు చేయాల్సింది.. మీ పేరు, వివరాలు మాకు పంపడమే'. 'స్నేహితుడు మీకు సరికొత్త రూపంలో సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతున్నారు. నీలిరంగు గీతను క్లిక్ చేయండి' అంటూ వాట్సాప్ లేదా, ఎస్ఎంఎస్ మెసేజ్ వచ్చిందా.. అయితే జాగ్రత్త, పడాలి. జనమంతా సంక్రాంతి సంబరాల్లో ఉంటే వారికి శుభాకాంక్షలు, ఉచిత కానుకల పేరిట లింక్‌లు పంపి సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధమయ్యారు. అపరిచిత వ్యక్తుల నుంచి అందే మెసేజ్‌ల్లో లింక్‌లు క్లిక్ చేయవద్దని.. ప్రధానంగా 'ఏపీకే' లింక్‌ల జోలికి అసలు వెళ్లరాదంటూ జిల్లా సైబర్ విభాగం హెచ్చరిస్తోంది.

సీఎం చంద్రబాబు కానుక అంటూ...

- 'నూతన సంవత్సరం సందర్భంగా (నారా చంద్రబాబు నాయుడు) ప్రతి ఒక్కరికీ 3 నెలల రీచార్జ్ రూ.749 పూర్తిగా ఉచితంగా ఇస్తున్నారు. కాబట్టి క్రింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయడం ద్వారా ఇప్పుడే రీచార్జ్‌ని పొందండి. ఈ ఆఫర్ పరిమిత కాలానికి మాత్రమే' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ వైరల్ అవుతోంది. సీఎం చంద్రబాబు పేరు కనిపిస్తుండడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు అత్యుత్సాహం చూపిస్తూ తమతమ వాట్సాప్ గ్రూపుల్లో తెగ వైరల్ చేసేశారు.
- 'సంక్రాంతికి లక్ష్మీదేవి మీ ఇంటికి వస్తోంది. అమ్మ వారి కాయిన్ పంపిస్తాం. రూ.50 మాత్రమే' అంటూ మరో లింక్ కూడా వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది.
- డియర్ కస్టమర్. మీ ఎస్‌బీఐ ఖాతా లావాదేవీలు నిలుపుదల చేశాం. ఖాతా కూడా ఈ రోజు రాత్రి లోపు శాశ్వతంగా బ్లాక్ చేయబడుతుంది. ఖాతాలో ఆధార్ నంబర్ అప్‌డేట్ కాలేదు. వెంటనే ఆధార్ కార్డును బ్యాంక్ ఖాతాతో అప్‌డేట్ చేసుకునేందుకు కింది లింక్‌ను నొక్కండి' అంటూ ఎస్‌బీఐ ఆధార్ అప్‌డేట్ పేరుతో ఏపీకే లింక్ వైరల్ అవుతోంది.

ఈ తరహా మెసేజ్‌లన్నీ మోసపూరితమే. పండుగల సందర్భంగా ఏ ఒక్కరూ ఎవరికీ ఉచితంగా కానుకలు ఇవ్వరనే విషయాన్ని గుర్తించుకోవాలని అంటున్నారు సైబర్ నేర విభాగం అధికారులు. మరో వైపు ప్రభుత్వ పథకాల పేర్లు చెప్పి వాటికి మీరు అర్హత సాధించారంటూ మోసం చేసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. పొరపాటున ఆయా లింక్‌లు క్లిక్ చేసి మోసపోతే తక్షణమే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

యువతకు ఆదర్శం లాయర్ తులసిరెడ్డి

- సంస్మరణ సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నిత్యం ప్రజాసేవకు పరితపించిన న్యాయవాది తులసిరెడ్డి నేటితరం యువతకు ఆదర్శమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందిన తులసిరెడ్డి సంతాపసభ ఆదివారం ఎస్కేయూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగింది. సీనియర్ న్యాయవాది బి.నారాయణరెడ్డి, ఆల్ ఇండియా రేడియో అధికారి నాగేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా తులసిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ఎస్కేయూలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసిస్తున్న సమయంలో తులసిరెడ్డి చాలామందికి సుపరిచితుడయ్యారన్నారు. తానులా చదివే సమయంలో సహకారం అందించారని గుర్తు చేశారు. ఆ సమయంలో కొత్తగా అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు ఆశ్రయం కల్పించడమే కాక, వారికి మార్గదర్శిగా ఉంటూ వచ్చారన్నారు. అవివాహితుడిగా ఉంటూ పలువురికి సాయం అందించారన్నారు. విద్యాలయం పరిచయం లేని వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ బాగా చదువుకోవాలంటూ చెప్పేవారన్నారు. ఆయన ప్రోత్సాహంతో చదువుకున్న అనేకమంది నేడు ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. అందరి కోసం నిస్వార్థంతో పని చేసిన తులసిరెడ్డి ఈ రోజు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ ముండ్ల వెంకటశివారెడ్డి మాట్లాడుతూ... సహాయం అనే పదానికి పర్యాయపదం తులసిరెడ్డి అని కొనియాడారు. ఎవరు అడిగినా లేదనకుండా సాయం చేసేవారని గుర్తు చేశారు.

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తులసిరెడ్డిలో ప్రేమ, అభిమానం, ఆప్యాయత ఎక్కువగా ఉన్నాయన్నారు. అలాంటి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. అనంతపురం నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... విశ్వ విద్యాలయంలో వామపక్ష భావజాలం అధికంగా ఉన్న ఆ రోజుల్లోనే ఎస్ఎస్‌యూఐను బలోపేతం చేసిన వ్యక్తి తులసిరెడ్డి అని గుర్తు చేశారు. సీనియర్ న్యాయవాది నారాయణరెడ్డి మాట్లాడుతూ... తులసిరెడ్డి తన జీవితం మొత్తం స్నేహితుల కోసమే ధారపోశారన్నారు. రాయలసీమలో ఎక్కడికి వెళ్లినా ఆయనకు స్నేహితులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైపీ స్వరూప్‌కుమార్‌రెడ్డి, తులసిరెడ్డి సోదరుడు గంగిరెడ్డి, అదనపు ఎస్పీ శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఐఆర్ఎస్ అధికారి లోకనాథరెడ్డి, రథాంగపాణి రెడ్డి, న్యాయవాది శ్యామ్‌సుందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఎస్కేయూ పూర్వ విద్యార్థులు జగదీశ్వరరెడ్డి, శ్రీనివాసులు, చేనేత జౌళిశాఖ విశ్రాంత డీడీ రామప్ప పాల్గొన్నారు.

పచ్చదనాన్ని హరించిన టీడీపీ నేతలు

- ఇష్టారాజ్యంగా వాటర్ షెడ్ పనులు
- అడ్డువచ్చిన 12 ఏళ్ల నాటి 15 చింతచెట్ల తొలగింపు
- పట్టించుకోని అధికారులు
- వాటర్‌షెడ్ లక్ష్యం నిర్వీర్యం



వాటర్‌షెడ్ పనుల కోసం కూకటి వేళ్లతో సహా పెకలించిన చింతచెట్లు

కళ్యాణదుర్గం రూరల్: భూగర్భ జలాల పెంపుతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమలవుతున్న వాటర్‌షెడ్ ప్రధాన లక్ష్యాన్ని స్థానిక టీడీపీ నేతలు తమ స్వార్థం కోసం నిర్వీర్యం చేశారు. వారి ఆగడాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ ఉండిపోయారు. ఫలితంగా పచ్చని చెట్లు హరించిపోయాయి. ఒకటి.. రెండు కాదు... ఏకంగా 15 చింత చెట్లను కూకటి వేళ్లతో సహా పెకలించేశారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల పంచాయతీలో ఈ ఘటన చోటు చేసుకుంది. వాటర్‌షెడ్ పథకం కింది రూ 6,35,06,000తో 2021లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ సమయంలో పనులు జరగకుండా గోళ్ల సర్పంచ్ కవితాబొజ్జన్న న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటర్‌షెడ్ కమిటీకి ఎలాంటి సమాచారం లేకుండానే నూతన కమిటీని స్థానిక టీడీపీ నేతలు ఏర్పాటు చేసి, సర్వే నంబర్ 221లో 66 ఎకరాల దేవుని మాన్యంలో రెండు నెలల క్రితం పనులు చేపట్టారు. ఇందులో 12 ఏళ్ల క్రితం చింత వనాన్ని అభివృద్ధి చేశారు. పనులు చేపట్టిన టీడీపీ నేతలు చుట్టూ ఇంకుడు గుంతలు తవ్వారు. ఈ క్రమంలో పనులకు అడ్డుగా వచ్చిన 15 చింత చెట్లను కూకటి వేళ్లతో సహా పెకలించేశారు. ఆలస్యంగా విషయాన్ని తెలుసుకున్న స్థానిక రైతులు నివ్వెర పోయారు. దిగువ ప్రాంతాల్లో కాకుండా ఎగువ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వితే ఫలితం లేదని, వెంటనే పనులు ఆపేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఏపీడీ శ్రీవిద్య మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.



పనులు ఆపేయాలంటూ డిమాండ్ చేస్తున్న స్థానికులు

ప్రమాదంలో విద్యార్థి మృతి



వడిత్యా రాజ్‌కుమార్ నాయక్ (ఫైల్)

రాప్తాడు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట గ్రామానికి చెందిన వడిత్యా హనుమంతనాయక్ కుమారుడు రాజ్‌కుమార్‌నాయక్ (17) అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి 7.30 గంటలకు మరో ఇద్దరితో కలసి ద్విచక్ర వాహనంపై గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళుతుండగా ఎదురుగా సింగిల్ లైట్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. రాజ్‌కుమార్‌తో పాటు మిగిలిన ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను కుటుంబసభ్యులుర వెంటనే సర్వజనాస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడిపినట్లు మృతుడి బంధువులు ఆరోపించారు. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారున.

తల్లిదండ్రుల అంగీకారంతో నేత్రదానం

మృతుడు రాజ్‌కుమార్ నాయక్ నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. మరో ఇద్దరికి ప్రపంచాన్ని చూసే భాగ్యాన్ని కల్పించాలన్న లక్ష్యంతో బాధలోనూ ఔదార్యాన్ని చాటుకున్న తల్లిదండ్రులు వడిత్యా రాజేశ్వరిబాయి, వడిత్యా హనుమంత నాయక్, పెద్దనాన్న వడిత్యా శంకర్‌నాయక్‌ను ఈ సందర్భంగా వైద్యులు అభినందించారు.

డ్రైవర్ అనుమానాస్పద మృతి



ఆంజనేయులు (ఫైల్)

బెళుగుప్ప: సరుకుతో తమిళనాడుకు వెళ్లిన లారీ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో అక్కడే మృతిచెందాడు. మూడు రోజులు ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... బెళుగుప్ప మండలం విరుపాపల్లికి చెందిన ఆంజనేయులు (38) అనంతపురానికి చెందిన యజమాని వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లిన సరుకు తీసుకుని తమిళనాడులోని కోయంబత్తూరులో అన్‌లోడ్ చేయించాడు. అనంతరం తిరుగు ప్రయాణమైన ఆంజనేయులు పత్తా లేకుండా పోయింది. మూడు రోజులుగా ఫోన్ చేస్తున్నా భర్త నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆయన భార్య సరస్వతి ఆందోళనకు గురైంది. అదే సమయంలో కోయంబత్తూరు వద్ద కాలువ సమీపంలో రెండు రోజులుగా ఆంధ్రాకు చెందిన లారీ నిలబడి ఉన్నట్లుగా ఆదివారం సమాచారం అందుకున్న అక్కడి పోలీసులు వెళ్లి పరిశీలించారు. కాలువలో విగతజీవిగా పడి ఉన్న ఆంజనేయులు మృతదేహాన్ని గుర్తించి, వెలికి తీసి ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి విషయాన్ని బెళుగుప్ప పోలీసులకు చేరవేయడంతో సమాచారం అందుకున్న భార్య... ఆంజనేయులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుంటూరు జిల్లా చావలాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలసి వలస వచ్చి గార్లదిన్నె మండలం ఇల్లూరు వద్ద బొగ్గుల బట్టీలో కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆయన కుమారుడు ఏసుదాసు(6), మరో చిన్నారితో కలసి బొగ్గుల బట్టీ సమీపంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడ్డాడు. గట్టున ఉన్న చిన్నారి పరుగున వెళ్లి తెలపడంతో తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. నీట మునిగిన ఏసుదానును వెలికి పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు దినేష్

గుంతకల్లు: స్థానిక శ్యామ్‌సన్ పురం ప్రాంతానికి చెందిన రాజన్న, దీనమ్మ దంపతుల కుమారుడు దినేష్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. 2023, డిసెంబర్ 25న చోటు చేసుకున్న ఘర్షణలో దినేష్ తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. ఆస్పత్రిలో చాలా రోజులు చికిత్స పొందిన అనంతరం కోమా నుంచి బయటపడినా... మతి స్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతూ వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం కుటుంబసభ్యులందరూ ప్రార్థనల కోసమని చర్చికి వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉన్న దినేష్.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చర్చి నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఫ్యాన్‌కు వేలాడుతున్న దినేష్‌ను చూసి బోరున విలపించారు. చుట్టుపక్కల వారి సాయంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా... పరీక్షించిన వైద్యులు అప్పటికే దినేష్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఫేస్ వాష్ బ్రేక్



కూడేరు మండలం జల్లిపల్లి టోల్‌ప్లాజా వద్ద ఫేస్‌వాష్ బ్రేక్ కార్యక్రమాన్ని చేపట్టిన పోలీసులు

అనంతపురం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రోజూ టోల్‌ప్లాజాల వద్ద 'ఫేస్ వాష్ బ్రేక్' కార్యక్రమాన్ని చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను నిలిపి డ్రైవర్లు నీటితో ముఖం కడుకున్న అనంతరం జాగ్రత్తలు తెలిపి పంపుతున్నారు.

క్లుప్తంగా

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నగర కమిటీ ఎన్నిక



అధ్యక్షుడికి డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి

అనంతపురం అర్బన్: నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నగర శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని సంఘం కార్యాలయంలో నగర శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చెన్నప్ప సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ అందజేశారు.

నగర శాఖ నూతన కమిటీ

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నగర కమిటీ అధ్యక్షుడిగా వీ.ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా కె.ఫక్రుల్లాఖాన్, ఎల్.కిరణ్, కార్యదర్శిగా ఎస్.జాఫర్‌వలి ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా ఎం.మదార్ సాహెబ్, బి.ఈశ్వరయ్య, కోశాధికారిగా బి.వి.రమణ ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందజేత



డ్రైవర్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: ఇటీవల గుండెపోటుతో మరణించిన లారీ డ్రైవర్ నటరాజు కుటుంబానికి లారీ డ్రైవర్లు, క్లీనర్ల సంఘం ఆర్థిక తోడ్పాటు అందించింది. ఆదివారం తపోవనంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నటరాజు కుమారుడు భరత్ సాయికి రూ.30 వేల చెక్కును ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, గౌరవాధ్యక్షుడు నారాయణస్వామి, అధ్యక్షుడు రజేష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నటరాజు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. డ్రైవర్లకు ఆరోగ్య బీమాను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.కృష్ణుడు, చిరంజీవి, వెంకటేష్, లఖన్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



ముస్తఫాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

రాప్తాడురూరల్: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న అనంతపురం రూరల్ మండలం కురుగుంట పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముస్తఫాను ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహానందరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మిషన సభ్యులు రాజారామ్, చియ్యేడు సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, బీసీ నాయకులు ధనుంజయయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, పూలకుంట శివారెడ్డి, నసనకోట ముత్యాలు, చిత్రా వెంకటరాముడు, కుంటిమద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ సాయికి స్వామి వివేకానంద అవార్డు



విజయ్ సాయికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: పాన్ ఇండియా సోషల్ కల్చరల్ అసోసియేషన్ వారు స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా మైసూరు నగరంలో పలు రాష్ట్రాల్లో యువతను ప్రోత్సహిస్తూ నిరంతర సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారికి ఎక్స్‌లెన్సీ అవార్డులు అందజేశారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన సామాజిక సేవాకార్యకర్త విజయ్‌సాయికి అమెరికన్ యూనివర్శిటీ చాన్సలర్ ఆచార్య మధుకిషన్ చేతుల మీదుగా ఇన్‌స్పైర్ రాయల్ ఎక్స్‌లెన్సీ స్వామి వివేకానంద అవార్డు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న స్ఫూర్తిదాయక సేవలను కొనియాడారు.

ఊరెళ్తున్నారా.. జరభద్రం



- దొంగతనాలు జరిగే అవకాశం
- ఇప్పటికే భారీ చోరీలతో హడలెత్తిస్తున్న దొంగలు
- పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే మేలు
- అందుబాటులో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు

రాప్తాడు: సంక్రాంతి పండుగ రానే వచ్చింది. పాఠశాలలకు 10 రోజులు సెలవులు ఇవ్వడంతో చాలా మంది సొంత గ్రామాలకు వెళ్తున్నారు. ఇదే అదునుగా దొంగలు ఇళ్లలో చొరబడే ప్రమాదమున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. క్యాంపులకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారమిచ్చి ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకుంటే మరింత మేలని చెబుతున్నారు. అపార్ట్‌మెంట్లలో ఉన్న వారు వాచ్‌మెన్‌ను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. అతడి ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చేటప్పుడు వాచ్‌మెన్ ప్రశ్నించేలా అప్రమత్తం చేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు, అడ్రస్, ఫోన్ నంబర్, ఎక్కడికి వెళ్తున్నారు? వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో, ప్రవేశ ద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము బంగారం, వెండి, ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. సెల్లార్లలో ప్రవేశ ద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

స్వగ్రామాలు, క్యాంపులు, దేవాలయాలకు వెళ్లే ముందు ఇంటికి తాళాలు వేసేటప్పుడు పక్కింటి వారికి సమాచారమివ్వాలి. కాస్త ఇల్లు చూడమని చెప్పాలి. వీలైతే దగ్గరలోని సచివాలయ పోలీసులకు తెలియజేయాలి.

- ఎక్కువ రోజులు బయటకు వెళ్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా వీరికి భద్రత కల్పిస్తారు.
- ప్రతి ఒక్కరూ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- అపరిత వ్యక్తులు తారసపడితే 100కు గానీ 112కు గానీ డయల్ చేసి పోలీసులకు చెప్పాలి.
- మంచి నీళ్ల కోసం, సహాయం కోసం వచ్చే వారు అనుమానాస్పదంగా ఉంటే తలుపులు తీయకుండానే మాట్లాడి పోలీసులకు ఫోన్ చేయాలి.
- ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు విలువైన బంగారం, నగదు బ్యాగుల్లో భద్రపరిచి గమనిస్తుండాలి.
- షాపింగ్ చేసేటప్పుడు ప్రజలు తమ బ్యాగులు, పర్సులు ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. పిక్‌పాకెటర్స్ ఉంటారు. ద్విచక్ర వాహనాలు, కార్లకు హ్యాండ్‌లాక్ తప్పనిసరి.

అప్రమత్తత అవసరం

ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకూడదు. బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకండి. షాపింగ్ చేసే వారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బుతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్న చోటు జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగలించేవారు ఉంటారు. చుట్టుపక్కలా వారిని గమనిస్తుండాలి. కరెన్సీ నోట్లు కింద పడేసి, మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు తెచ్చుకున్నప్పుడు డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది. డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైనంత వరకు నగదు రహిత లావాదేవీలకు మొగ్గు చూపాలి.

చోరీలకు చెక్



సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే వారు తప్పకుండా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలి. పోలీస్‌యాప్ ఎల్‌హెచ్ ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. అపార్టుమెంట్లు, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. బంగారు, వెండి ఆభరణాలను ఉంచకూడదు. బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. అత్యవసరమైతే డయల్ 100 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, అనంతపురం రూరల్

అప్రమత్తం చేస్తున్నాం



ఊళ్లకు వెళ్లే ముందు సమాచారమిస్తే పోలీసు యాప్, ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఇంటి యజమాని మొబైల్, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు జీపీఎస్ ద్వారా అనుసంధానిస్తాం. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలకు అర్థమయ్యేలా కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం.

– శ్రీహర్ష, సీఐ, రాప్తాడు

పరామర్శ



రామచంద్రా నాయక్ మృతదేహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని డీకే తండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామచంద్రా నాయక్ (52) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తొపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లారు. రామచంద్రా నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దు.. ధైర్యంగా ఉండాలని సూచించారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ జొన్నగిరి బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్, మదిగుబ్బ వీరాంజనేయులు, రాముానాయక్, పోతన్న నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో టైలర్‌కు గాయాలు

అనంతపురం: నగరంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ టైలర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గౌరవ హోమ్స్‌కు చెందిన మహబూబ్ బాషా టైలర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్తుండగా.. వెనుకవైపు నుంచి మరో బైక్ ఢీ కొట్టింది. మహబూబ్ బాషా రోడ్డుపై ఎగిరిపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం



కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి | ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి | గౌని నాగన్న | చింతకుంట మధు | లింగాల రమేష్ | చింతకుంట అమర్‌నాథ్ | మల్లెల వేణుగోపాల్ | షేక్ ఖాజాపీర్ | గురుశేఖర్ బాబు | వెంకటకృష్ణ

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో అనంత నాయకులకు చోటు లభించింది. ఇటీవల విడుదల చేసిన జిల్లా కమిటీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. బీసీలకు పెద్దపీట వేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో వివిధ హోదాల్లో నాయకులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారు అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెబుతున్నారు. అందులో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌని నాగన్న, అధికార ప్రతినిధిగా చింతకుంట మధు, కార్యనిర్వహణ కార్యదర్శులుగాగా లింగాల రమేష్, చింతకుంట అమర్‌నాథ్, మల్లెల వేణుగోపాల్, షేక్ ఖాజాపీర్, యాక్టివిటీ కార్యదర్శులుగా గురుశేఖర్ బాబు, వంకదారి వెంకటకృష్ణ నియమితులయ్యారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పించిన మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: దేశ ఔన్నత్యాన్ని విదేశాల్లో ఘనంగా చాటి యువతకు ఆదర్శంగా నిలిచిన స్వామి వివేకానంద జీవితం ఆదర్శప్రాయమని నగర మేయర్ వసీం అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలో పలు చోట్ల స్ఫూర్తిదాయక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం స్థానిక టవర్‌క్లాక్ వద్ద వివేకానంద విగ్రహానికి మేయర్ వసీంతో పాటూ కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, ఇషాక్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు తదితరులు నివాళులర్పించారు.

- శ్రీరామకృష్ణ సేవా సమితి శ్రీధర మూర్తి ఆధ్వర్యంలో స్థానిక హెచ్చెల్సీ కాలనీ నుంచి టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ చేపట్టారు. శాంతి నినాదాలతో స్వామి వివేకానందకు ఘనంగా నీరాజనాలర్పించారు. స్వామి వివేకానంద వేషధారణలో ఉన్న యువకులు ఆకట్టుకున్నారు.
- వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక అశోక నగర్‌లోని స్వామి వివేకానంద పార్కులో జాతీయ యువతజనోత్సవ వేడుకలు జరిగాయి. మెళవాయి రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇటీవల భగవద్గీత పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సేవకులు, యోగా గురువులతో కలిసి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వివేకానంద జయంతి సందర్భంగా భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గీతామందిరంలో వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ అందించారు. పరుచూరు రమేష్‌బాబు నేతృత్వంలో విద్యావేత్తలు కోరాడ రామకృష్ణ, ఆలూరు రాఘవేంద్ర, సీనియర్ న్యాయవాది నాగేశ్వరి, నాగన్న తదితరులు జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన వారిలో 60 మందిని ఎంపిక చేసి వారికి కృత్రిమ అవయవాలు అందజేశారు.

వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తి



ఎస్కేయూలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

అనంతపురం: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తి అని ఏబీవీపీ పూర్వ కార్యకర్త, న్యాయవాది శ్రీకాంత్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏబీవీపీ ఉమ్మడి జిల్లా విభాగ్ కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి, జిల్లా కన్వీనర్ కమలాకర్, విజయ్, సుధీర్, ఉదయ్ పాల్గొన్నారు.

- కేంద్ర యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వశాఖ , నెహ్రూ యువకేంద్రం , రూడ్‌సెట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జిల్లా గౌరవాధ్యక్షుడు రమేష్ పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో యువజన జాగృతి సొసైటీ వ్యవస్థాపకుడు వెంకటేష్, రూడ్‌సెట్ రీసోర్స్‌పర్సన్ ఉషారాణి, యంగ్‌లీడర్ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలందించడం అభినందనీయం



సంఘమిత్ర సమావేశానికి హాజరైన వివిధ ప్రాంతాల సేవకులు

అనంతపురం కల్చరల్: సమాజాభివృద్ధిలో పాల్గొనడం బాధ్యతగా గుర్తించడం వల్ల ఎంతో మందికి సమాజ సేవ చేసుకునే అవకాశం లభిస్తోందిన పలువురు సామాజిక సేవకులు తెలిపారు. ఆదివారం స్థానిక అనంత కన్వెన్షన్ హాలులో 'సంఘమిత్ర' కార్యక్రమం నిర్వహించారు. ప్రజా గాయకుడు ఎస్కే లెనిన్ బాబు నేతృత్వంలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, మీనాక్షమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా సామాజిక సేవకుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేర్వేరు ప్రాంతాలకు చెందిన 150 మందికి పైగా సేవకులు తరలివచ్చారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, రవికాంత్ రమణ, క్రియేటర్ కృష్ణ తదితరులు మాట్లాడుతూ.. సమాజ సేవలో ఎన్నో సంస్థలు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నాయన్నారు. వాటిని సమాజానికి పరిచయం చేసే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకు ముందు స్వామి వివేకానంద, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, మీనాక్షమ్మ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. లెనిన్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు

అనంతపురం కల్చరల్: అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి మాజీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత అన్నారు. అంబేడ్కర్ అక్షరీయం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో అడివాల శేషగిరి రాయుడు రచించిన 'దాసప్ప గారి మనవడు' హనుమంత రాయుడు రచించిన 'దిగువింటోడి కథలు', ఎండ్లపల్లి భారతి 'దేవ రహస్యాలు', పల్లిపట్టు నాగరాజు 'నీలికళ్ల నేల', ముమ్ముడి నాగ సుమంత్ 'హ్యూమన్ లైఫ్' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఛాయ పబ్లికేషన్ డైరెక్టర్ అరుణాంక లత, ఆదిఆంధ్ర తిప్పేస్వామి, మారుతీ, అంకె శ్రీనివాస్, యాములపల్లి నర్సిరెడ్డి, సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, రాజారాం, మహాలింగ మల్లెల రాజేష్, ప్రజ్ఞా సురేష్, అనంత జిరసం అధ్యక్షుడు సాకే శ్రీహరిమూర్తి పాల్గొన్నారు.

ఉరుసులో ప్రత్యేక ప్రార్థనలు

అనంతపురం కల్చరల్: గుత్తి రోడ్డు రంగీలే పీర్ సాహెబ్ ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఆదివారం సందడిగా సాగింది. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీ నాయకులు అనంత చంద్రారెడ్డి, సైపుల్లా బేగ్ తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు వీరిని సత్కరించి ప్రసాదం అందించారు.

అలరించిన ఆ పాత మధురాలు

అనంతపురం కల్చరల్: స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక విగ్రహం వద్ద పాత పాటల ప్రేమికుల సమూహం వారి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన పాత పాటల కచేరి ఆకట్టుకుంది. సంగీత దర్శకుడు సత్యం, దర్శక నిర్మాత వీబీ రాజేంద్రప్రసాద్ స్మారకంగా వారి సినిమాల్లోని పాటలను ఆలపించారు. నిర్వాహకులు ఓబుళదాసు, రాఘవన్, శ్రీదేవి మాట్లాడుతూ ఇక ప్రతి నెల రెండవ ఆదివారం నగరవాసుల మనో ఉల్లాసం కోసం ఉచితంగా సంగీత కచేరీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: పవిత్ర ధనుర్మాసంలో వచ్చే గోదాదేవి కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం కనువిందుగా సాగాయి. స్థానిక రామ నగర్‌లోని కోదండరామాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు గోదా రంగనాథుల పరిణయ మహోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణ, గణపతి పూజతో ప్రారంభించి కల్యాణంలో వచ్చే ఎదుర్కోలు, తలంబ్రాలు, కాశీయాత్ర, మాంగల్య ధారణ వంటి ఘట్టాలను తమిళ పద్ధతుల్లో శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. నెలరోజులుగా తెల్లవారుజామున తిరుప్పావై పఠనం సాగుతోందన్నారు. సంక్రాంతి సందర్భంగా నిత్య పూజలుంటాయని తెలిపారు.

శిల్పారామంలో నేడు సంక్రాంతి సంబరాలు

అనంతపురం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని సోమవారం నుంచి రెండు రోజుల పాటు శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శనతో పాటు మానస నృత్య కళా కేంద్రం బృందం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న శ్రీలలిత నాట్య కళానికేతన్ నృత్య బృందం ఆధ్వర్యంలో జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అదే విధంగా 15న చిన్నారుల గాలి పటాలు ఎగురవేత, శివకృష్ణ (మైదుకూరు) వారిచే ఇంద్రజాల ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉట్టిపడిన సంక్రాంతి శోభ



ముగ్గులు వేస్తున్న దృశ్యం



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మహిళలు

అనంతపురం కల్చరల్: పల్లె లోగిళ్లలో పరిగెత్తే సంక్రాంతి లక్ష్మిని నగరానికి ఆహ్వానిస్తూ ఆదివారం పలుచోట్ల సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మూడవ రోడ్డులో షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలుగా నిలిచిన స్వాతి, మహేశ్వరి తదితరులకు టీవీ, మిక్సీ, ఎలక్ట్రికల్ కుక్కర్లను బహుమతులుగా అందించారు. బాబా మందిరాల గౌరవాధ్యక్షులు జయచంద్ర చౌదరి, మూడవ రోడ్డు బాబా మందిర అధ్యక్షుడు, కో-ఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మీరెడ్డి, పొత్తూరు దినేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కోవూరు నగర్‌లోని సక్షమ్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగ మహిళలకు ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కోదండరామ్ శ్రీదేవి, ఆర్ఎస్ఎస్ రాచమల్ల జగదీష్ ప్రసాద్, లలిత, భాగ్యలక్ష్మి, సువర్ణ, భాస్కరరెడ్డి, శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు. అవోపా (ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో స్థానిక రాజురోడ్డులో అవోపా కార్యాలయ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. జనప్రియ కవి ఏలూరు యంగన్న సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో అవోపా నాయకులు, కొత్తూరు, పాతూరు ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.